సాక్షి సూర్యాపేట

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



'గృహలక్ష్మి' వర్తింపజేయాలి

అర్హులకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింప జేయాలని శనివారం జాజిరెడ్డిగూడెంలో అఖిలపక్ష నేతలు ధర్నా చేశారు. - 8లో



శాస్త్రోక్తంగా నిత్యకల్యాణం

మట్టపల్లిలో శనివారం లక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. - 8లో



డీఎస్సీ గడువు పొడిగించాలి

డీఎస్సీ గడువును నాలుగు నెలలకు పొడిగించాలని పీడీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు డిమాండ్ చేశారు. - 10లో

న్యూస్‌రీల్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి వెంకటరమణ

తిరుమలగిరి (తుంగతుర్తి): సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ అన్నారు. శనివారం మున్సిపాలిటీ పరిధిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకులంలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిస రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అనంతరం తిరుమలగిరి మండలం వెలిశాల లోని పల్లె దవాఖానాను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. మహిళ లు గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయిన అనంతరం ఐదేళ్ల వరకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వందన, సీహె చ్ఓ బిచ్చునాయక్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

ఈ-పంచాయతీ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి



వినతిపత్రం అందిస్తున్న ఆపరేటర్లు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తమకు జూనియర్ అసిస్టెంట్ పేస్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఈ పంచాయతీ కంప్యూ టర్ ఆపరేటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వాంకుడోతు భిక్షం ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శనివారం సూర్యాపేట కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ సీహెచ్ ప్రియాంకకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13 ఏళ్ల నుంచి సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్న తమకు న్యాయం చేయా లని కోరారు. మహిళా ఉద్యోగులందరికీ వేత నంతో కూడిన ప్రసూతి సెలవులు కల్పించాల న్నారు. తమ న్యాయమైన డిమాండ్లను అమ లు చేయకుంటే వారం రోజుల్లో రాష్ట్ర వ్యాప్తం గా సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

జీఓ 142ను రద్దు చేయాలి



జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారికి వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తమకు గొడ్డలి పెట్టుగా మారిన జీఓ నంబర్ 142 రద్దు చేయా లని ప్రభుత్వ వైద్యుల సంఘం జిల్లా అధ్య క్షుడు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, జీఓ 142 రద్దు పోరాట కమిటీ జిల్లా అధ్యక్షుడు భూతరాజు సైదులు, ఐఎంటీయూసీ అధ్యక్షుడు మనోజ్ కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు శనివారం కలెక్టరేట్ లో డీఎంహెచ్ఓ డాక్టర్ హర్షవర్ధన్‌కు మెమో రాండం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇదే డిమాండ్‌పై ఈనెల 25న కలెక్టరేట్ ఎదుట నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వైద్య ఆరోగ్య శాఖ రాష్ట్ర ఉన్నతాధికారుల సల హాలు సూచనలు తీసుకోకుండా ప్రభుత్వం ఏకపక్షంగా జీఓను విడుదల చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ జీఓ రద్దయ్యే వరకు ఉద్యోగులందరినీ ఐక్యం చేసి పోరాడుతామన్నారు.

రెండో విడత గొర్రెలు పంపిణీ చేయాలి

దురాజ్‌పల్లి (సూర్యాపేట): జిల్లా వ్యాప్తంగా రెండో విడత గొర్రెలకు డీడీలు చెల్లించిన గొల్ల కుర్మలకు వెంటనే పంపిణీ చేయాలని తెలం గాణ గొర్రెలు మేకల పెంపకం దారుల సం ఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో విడత గొర్రెల కోసం గొల్లకుర్మలు అప్పులు చేసి డీడీలు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా నేటికీ పంపిణీ చేయకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్య దర్శి వీరబోయిన రవి, కడెం లింగయ్య, విన య్, కంచుగొట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రూప్–1 అభ్యర్థులకు

మళ్లీ నిరాశే..



సూర్యాపేట జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గ్రూప్-1 మెయిన్స్‌కు ప్రిపేరవుతున్న అభ్యర్థులు

- ప్రిలిమ్స్‌ను రెండోసారి రద్దు చేసిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం
- ఓఎంఆర్ షీట్‌లో హాల్‌టికెట్ నంబర్, ఫొటో లేదనే పిటిషన్‌పై నిర్ణయం
- జిల్లాలో పరీక్ష రాసిన అభ్యర్థులు 6,334 మంది

దురాజ్‌పల్లి (సూర్యాపేట): తెలంగాణలో జూన్ 11న జరిగిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలను రద్దు చేస్తూ హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీంతో పరీక్షలు రాసి రిజల్ట్ కోసం ఎదురుచూస్తున్న ఆశావహులకు రెండోసారి కూడా నిరాశే మిగిలింది. గతంలో నిర్వ హించిపరీక్షను పేపర్ లీకేజీ కారణంతో రద్దు చేశారు. దీంతో జూన్ 11న రెండోసారి తెలంగాణస్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలను నిర్వ హించింది. మళ్లీ రెండోసారి రద్దు చేయడంపై పరీక్ష రాసిన అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

ప్రిలిమ్స్ రాసింది 6,334 మంది

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 2,33,248 మంది హాజరయ్యారు. అయితే జిల్లాలో ఈ పరీక్షలకు 9,170 మంది దరఖాస్తు చేసుకోగా 6,334 మందే హాజరయ్యారు. మొదటి సారి టీఎస్‌పీఎస్సీలో వివిధ పరీక్షల పేపర్ల లీకేజీ వ్యవ హారం కారణంగా గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షలను మళ్లీ నిర్వహించిన విషయం తెలిసిందే. గత గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్షల్లో అభ్యర్థుల బయోమె ట్రిక్ తీసుకోగా జూన్ 11న రెండో సారి నిర్వహిం చిన పరీక్షలకు అలా చేయలేదు. దీంతో ప్రిలిమినరీ పరీక్షలు రద్దు చేయాలని ముగ్గురు అభ్యర్థులు తెలం గాణ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అభ్య ర్థుల బయోమెట్రిక్ తీసుకోకుండా, హాల్ టికెట్ నం బర్, ఫొటో లేకుండానే ఓఎమ్మార్ షీట్ ఇచ్చారని ఆ ముగ్గురు పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రిలిమ్స్ మళ్లీ నిర్వహించాలని కోర్టును అభ్యర్థించారు. అభ్యర్థుల పిటిషన్‌పై విచారించిన కోర్టు ప్రిలిమ్స్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో పరీక్షలు రాసి రిజల్ట్ కోసం ఎంతో ఆశగా చూస్తున్న అభ్యర్థులకు మళ్లీ నిరాశే ఎదురైంది. కాగా, అభ్యర్థులకు ఇబ్బంది కలుగకుండా సాధ్యమైనంత త్వరగా గ్రూప్–1 ప్రిలిమ్స్ నిర్వహించాలని కోర్టు ఆదేశించింది

ఆందోళనలో అభ్యర్థులు

గ్రూప్–1 ప్రిలిమ్స్ ఇప్పటికీ రెండో సారి రద్దు కావడంతో ఇప్పటికే పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్న అభ్యర్థులు ఆం దోళన చెందుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు పరీక్ష రాశారు. ఉద్యోగాలకు రాజీనామా చేసి మరీ కొంత మంది గ్రూప్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. ఇప్పుడు మరోసారి రద్దు కారణంతో వాళ్లంతా ఒక్క సారిగా షాక్‌కు గురవుతున్నారు. ప్రిలిమ్స్ రాసి మెయిన్స్ కోసం ప్రిపేర్ అవుతుండ గా.. మరోసారి ప్రిలిమ్స్ రాయాల్సి రావడం చాలా ఇబ్బందికరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండోసారి రద్దు చేయడం అన్యాయం



కష్టపడి చదివిన వారికి ఫలితం దక్కడం లేదు. వివిధ కారణాలతో ప్రభు త్వం వేసిన నోటిఫికేషన్లు రద్దు అవుతున్నాయి. గతం లో గ్రూప్–1 ప్రిలిమ్స్ రాసిన ప్పటికీ రద్దు అయింది. తాజాగా మరోమారు పరీక్ష రాస్తే మళ్లీ రద్దు చేశారు. ఏళ్ల తరబడి చదివిన చదు వులకు విలువ లేకుండా పోతుంది. ప్రిలిమ్స్ రెండో సారి రద్దు చేయడం అన్యాయం.

– ఇరుగు మనోజ్, ఆత్మకూర్ (ఎస్)

మళ్లీ ప్రిలిమ్స్‌కు చదవాలంటే ఇబ్బందే..



గ్రూప్–1 ప్రిలిమ్స్ పదేపదే రద్దు చేయడం తగదు. గతం లో రాసిన పరీక్షలో క్వాలిఫై అయ్యాను. కానీ, ఆ పరీక్ష రద్దయ్యింది. మళ్లీ పరీక్ష రాస్తే ఇప్పుడు మరోసారి రద్దు చేశారు. మళ్లీ ప్రిలిమ్స్‌కు చదవాలంటే ఇబ్బందే. ఇంకెంతకాలం ఎన్ని డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తుందేమోనని భయంగా ఉంది.

– గోద అనిల్‌కుమార్, కోదాడ

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి



టీఎస్‌పీఎస్సీ బోర్డు సభ్యుల వైఫల్యంతోనే గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్ష రెండు సార్లు రద్దు అయ్యింది. ప్రభుత్వం వెంటనే టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలి. మూడేళ్లుగా కటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ ఏడాడికి రూ.లక్ష ఖర్చుపెట్టి హైదరాబాద్‌లో హాస్టల్‌లో ఉంటూ గ్రూప్–1కు ప్రిపేర్ అవుతున్నాను. మొదటిసారి గ్రూప్–1 ప్రిలిమ్స్‌లో 86 మార్కులు సాధించి క్వాలిఫై అయ్యాను. రెండుసారి పరీక్ష రద్దు చేయడంతో అన్నివిధాలుగా నష్టపోయాం. అభ్యర్థులకు నష్టపరిహారం చెల్లించాలి. – కె.వినీత్‌రెడ్డి, గ్రూప్–1 అభ్యర్థి, నాగారంబంగ్లా

రూ. 3లక్షలు అప్పు చేసి కోచింగ్ తీసుకున్నా..



గ్రూప్–1 పరీక్షలకు హైద రాబాద్‌లో ఉండి ప్రిపేర్ అయితే రెండేళ్ల కాలంలో సుమారు రూ. 4లక్షల ఖర్చు వస్తోంది. నేను మూడు లక్షలు అప్పు చేసి కోచింగ్ తీసుకొని గ్రూప్–1కు ప్రిపేర్ అయ్యాను. ఇప్పుడు పరీక్ష రద్దు కావడంతో సమయం, డబ్బు వృథా అయినట్లే.. పొరపాట్లు జరుగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– టి.అశోక్, సూర్యాపేట

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



గ్రూప్–1 కోసం రెండు సంవత్సరాలుగా రూ.ల క్షల ఖర్చు పెట్టి ప్రిపేరవు తున్నాను. పరీక్షలు నిర్వ హించడంలో తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పూర్తిగా విఫలమవుతుంది. పరీక్షలు రద్దవడం వల్ల నాలాంటి నిరుద్యోగులు మనో వేదనకు గురవుతున్నారు. ఈ సారైనా పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి వెంటనే ఫలితాలు కూడా ప్రకటించాలి.

– బందారి సైదులు, తిరుమలగిరి

నిరుద్యోగులకు న్యాయం చేయాలి



సంవత్సరం నుంచి ఎం తో కష్టపడి చదివి గ్రూప్–1 ప్రిలిమ్స్ రాశాను. ఇప్పటికి రెండు సార్లు పరీక్షలను రద్దు చేశారు. ప్రిపేర్ కావడా నికి లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇవ్వన్ని ఎవరు ఇస్తారు మాకు. మేం పడ్డ కష్టం, సంవత్సరం కాలం వృథా అయ్యాయి. ప్రస్తుతం ఉన్న టీఎస్‌పీఎస్‌ని రద్దు చేసి నిరుద్యోగులకు న్యాయం చేయాలి.

– ఎంఎస్ రాజు, బూరుగడ్డ, హుజూర్‌నగర్

హస్తినకు ఆశావహులు



కాంగ్రెస్ నేతల ఢిల్లీ బాట..

- టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు
- ఏఐసీసీ పెద్దలను కలుస్తున్న నాయకులు
- నియోజకవర్గానికి ఇద్దరు ముగ్గురు చొప్పున అక్కడే మకాం

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : కాంగ్రెస్ పార్టీ ఆశావ హులంతా ఢిల్లీ బాట పట్టారు. ఇప్పటికే చాలా మం ది ఢిల్లీలో మకాం వేయగా, మరికొంత మంది హస్తి నకు పయనమయ్యారు. కాంగ్రెస్ పార్టీ టికెట్లను ఖరారు చేసేందుకు స్క్రీనింగ్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తోంది. దీంతో తమ బెర్త్‌ను దక్కించుకునే ప్రయత్నాల్లో ఆశావహులు నిమగ్నమయ్యారు. తమ బయోడెటాలు, తాము చేసిన పార్టీ కార్యక్ర మాల ఫైళ్లను పట్టుకొని ఏఐసీసీ నేతల కార్యాల యాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఒక్కో నియోజకవర్గం నుంచి ఇద్దరు ముగ్గురు చొప్పున ఢిల్లీలో మకాం వేశారు. టికెట్ కోసం సంఖ్యాపరంగా ఎక్కువ మంది దరఖాస్తు చేసుకున్నా ఢిల్లీకి వెళ్లిన వారిలో ఒక్కో నియోజకవ ర్గం నుంచి ఇద్దరు ముగ్గురు చొప్పున ఉన్నారు. ఒకటి రెండు నియోజకవర్గాలకు చెందిన వారు మినహా, మిగితా అన్ని నియోజకవర్గాలకు చెందిన ఆశావహులు ఢిల్లీల్లోనే ఉన్నారు. ఢిల్లీకి వెళ్లిన నేత లంతా కేంద్ర ఎన్నికల కమిటీ సభ్యులను కలుస్తు న్నారు. రాష్ట్రానికి చెందిన టీపీసీసీ అధ్యక్షుడు రేవం త్‌రెడ్డి, ఎంపీలు, స్క్రీనింగ్ కమిటీ సభ్యులైన ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాష్కీ గౌడ్, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ సెక్రటరీ మన్సూర్ అలీ, తెలంగాణ ఎన్నికల స్క్రీ నింగ్ కమిటీ చైర్మన్ విష్ణునాథన్ తదితర నేతలను కలుస్తున్నారు.

ఢిల్లీలో వీరే..

మునుగోడు నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్న పార్టీ అధికార ప్రతినిధి పున్నా కైలాష్‌నేత ఇప్పటికే ఢిల్లీలో మకాం వేయగా, చలమల్ల కృష్ణారెడ్డి, పాల్వాయి స్రవంతి త్వరలోనే ఢిల్లీకి వెళ్లనున్నట్లు తెలిసింది. మిర్యాలగూడ నుంచి బత్తుల లక్ష్మారెడ్డి, భువనగిరి నుంచి జిట్టా బాలకృష్ణారెడ్డి కూడా త్వర లోనే ఢిల్లీకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. ఇక ఆలేరు నుంచి బీర్ల అయిలయ్య, తుంగతుర్తి నుంచి అద్దంకి దయాకర్, ప్రీతం, సూర్యాపేట నుంచి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, మిర్యాలగూడ నుంచి రఘువీర్‌రెడ్డి, దేవరకొండ నుంచి రవినాయక్, భువనగిరి నుంచి శివరాజ్‌గౌడ్ తదితర నేతలు ప్రస్తుతం ఢిల్లీలోనే ఉం డి తమ ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే అధిష్టానం టికెట్ ఎవరికి ఖరారు చేస్తుందన్నది మాత్రం అక్టో బరు మొదటి వారంలో తేలనుంది.

వీరేశం పోటీ చేసే స్థానంపై చర్చ

కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్న నకిరే కల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశంను కాంగ్రెస్ పార్టీ ఎక్కడి నుంచి పోటీలో దింపుతుందన్న దానిపైనే చర్చ సాగుతోంది. ఆయనను నకిరేకల్ నుంచి కాకుండా, తుంగతుర్తి నుంచి పోటీలో దిం పాలన్న చర్చను పార్టీలో కొందరు నేతలు తీసుకువ చ్చారు. తాను నకిరేకల్ నుంచి మాత్రమే పోటీ చేస్తానని, అక్కడ టికెట్ ఇస్తేనే కాంగ్రెస్ పార్టీలో చేరుతానని వీరేశం గతంలోనే పార్టీ నేతలకు స్పష్టం చేశారు. అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని, మరో నియోజకవర్గం నుంచి చేయబోనని పేర్కొన్నారు. నకిరేకల్ టికెట్ ఇచ్చేందుకు ఓకే చెప్ప డంతోనే శుక్రవారం రాత్రి ఢిల్లీకి చేరుకున్నారు.

వీరేశం చేరిక.. మరికొంత ఆలస్యం

- కాంగ్రెస్‌లో చేరిన ఆయన అనుచరులు



ఢిల్లీలో రేవంత్‌రెడ్డిని కలిసిన నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం కాం గ్రెస్ పార్టీలో చేరిక రెండు మూడు రోజులు ఆల స్యం కానుంది. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అందుబాటులో లేకపోవడం.. వీరేశం చేరిక ఆలస్యానికి కారణమని తెలిసింది. అప్పటి వరకు వీరేశం ఢిల్లీలో ఉండనున్నారు. శనివారం ఆయన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రె డ్డిని ఢిల్లీలో కలిశారు. వీరేశంతో ఢిల్లీకి వెళ్లిన ఆయన అనుచరులు శనివారం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చిట్యాల వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కాటం వెం కన్న, నార్కట్‌పల్లి మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, కట్టంగూరు మాజీ జడ్పీటీసీ, ప్రస్తుత ఎంపీటీసీ మాద యాదగిరి, తాటికల్, గోరెంక లపల్లి ఎంపీటీసీ సభ్యులు గాదగోని శ్రీలత కొండయ్య, దాసరి వీరార్జున్‌రెడ్డి, మర్రూర్, నెమ్మాని మాజీ సర్పంచ్‌లు నకిరేకంటి నరేంద ర్, సిద్దగోని స్వామి, ఇనుపాముల ఎంపీటీసీ బొజ్జ సుందర్, కేతేపల్లి, చిట్యాల మాజీ ఎంపీపీ లు గుత్తా మంజుల మాదవరెడ్డి, బట్టు అరుణఅ యిలేష్, సీనియర్ నాయకులు గంగుల రాజిరెడ్డి, పుల్లెంల అచ్చాలు, బింగి కొండయ్య, గడ్డం పశుపతి, సట్టు సత్తయ్యతో పాటు మరో 50 మందికి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ కండు వాలు కప్పారు. అయితే వీరేశంకు ఇచ్చే స్థానం విషయంలోనే మరింత స్పష్టత కోసమే ఆగిన ట్లుగా తెలుస్తోంది.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీవాణి



మాట్లాడుతున్న జడ్జి శ్రీవాణి

చివ్వెంల: మహిళలంతా రాజ్యాంగ చట్టాలపై అవ గాహన కలిగి ఉండాలని జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి అన్నారు. శనివారం సూర్యా పేటలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మానవ అక్రమ ణ రవాణాపై నిర్వహించిన సదస్సులో మాట్లా డారు. మానవ అక్రమ రవాణాలో భాగంగా చిన్న పిల్లలు, మహిళలు, యువతులను అపహరించి వారి చే చట్ట విరుద్ధమైన పనులు చేయిస్తున్నా రన్నారు. మహిళలు, బాలికలకు ఇలాంటి సమస్య లు ఎదురైతే పోలీస్‌స్టేషన్లు, కోర్టు లను ఆశ్రయిం చాలన్నారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కె.సురేష్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.ప్ర శాంతి, బార్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శి నర్స య్య, న్యాయవాదులు పాల్గొన్నారు.

నకిలీ ఓట్ల అభ్యంతరాలపై గ్రామాల్లో విచారణ

చిలుకూరు: మండలంలోని పలు గ్రామాల్లో నకిలీ ఓట్లు ఉన్నాయని ఓ ఇద్దరు వ్యక్తులు చేసిన 775 అభ్యంతరాలపై శనివారం రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. అభ్యంతరాలు ఎదుర్కొం టున్న వారికి అధికారులు నోటీసులు పంపడం తోపాటు విచారణ చేశారు. వీటిలో చనిపోయిన 85 మందికి ఓట్లు 85 ఉన్నట్లుగా గుర్తించి వాటిని తొలిగించారు. మిగిలిన ఓటర్లు ఆయా గ్రామాల్లోనే నివాసం ఉంటున్నట్టుగా గుర్తించామని ఆ ఓట్లును యాథావిధిగా ఉంచినట్లు ఆర్ఐలు మంజుల, సీతయ్య తెలిపారు.

ఏకదంతుడికి నైవేద్య పూజలు



తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో ఆర్యవైశ్య సంఘం ఏర్పాటు చేసిన మండపం వద్ద వినాయకుడికి 128 రకాల వంటకాలు నైవేద్యంగా సమర్పించి పూజలు చేస్తున్న మహిళలు

2న కేటీఆర్ రాక

- నల్లగొండ, సూర్యాపేట పట్టణాల్లో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- సాయంత్రం నల్లగొండలో ప్రగతి నివేదన సభ



నల్లగొండ టూటౌన్: రాష్ట్ర పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అక్టోబర్ 2న ఉమ్మడి జిల్లా పర్య టనకు రానున్నారు. ఉదయం.. సూర్యాపేట పట్టణంలో, సాయంత్రం నల్లగొండ పట్టణంలో మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారు. సూర్యాపే టలో ఐటీ హబ్‌కు శంకుస్థాపన చేస్తారు. అనంతరం నల్లగొండకు చేరుకుని మర్రిగూడ బైపాస్‌లో ఫ్లైఓ వర్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. రూ.116 కోట్లతో నల్లగొండ పట్టణంలో రూపుదిద్దు కున్న రహదారుల విస్తరణ, సుందరీకరణ పనులకు ప్రారంభోత్సవం చేస్తారు. అదే విధంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఐటీ హబ్ భవనాన్ని కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అక్కడి నుం చి బీట్‌మార్కెట్ చేరుకొని అక్కడ నిర్మించిన సమీకృ త వెజ్, నాన్ వెజ్ మార్కెట్‌ను ప్రారంభిస్తారు.

కళాభారతి, బండ్‌కు శంకుస్థాపన..

నీలగిరి పట్టణంలోని పెద్ద గడియారం సెంటర్ పక్కన నీలగిరి కళాభారతి భవనం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఇక్కడే.. ఉదయ సము ద్రం బండ్ నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేస్తారు. ఉదయ సముద్రం వద్ద తీగల వంతెన నిర్మించడా నికి ప్రతిపాదన రూపొందించిన విషయం తెలిసిం దే. వీటితో పాటు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం, అమృత్–2 తాగు నీటి పథకం, ఆర్అం డ్‌బీ రీజినల్ కార్యాలయ భవన నిర్మాణం, ఆర్అం డ్‌బీ అతిథి గృహం భవనాలకు కూడా ఇక్కడే శంకు స్థాపన చేయనున్నారు. గత ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ నల్లగొండను దత్తత తీసుకుం టానన్న హామీ మేరకు.. నీలగిరి పట్టణాభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించిన విషయం తెలిసిందే. పట్టణంలో రహదారుల విస్తరణ, సుంద రీకరణ, సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఐటీ హబ్ రూపు దిద్దుకున్నాయి. కేటీఆర్ చేత అభివృద్ధి పనులను ప్రారంభించడానికి అధికార యంత్రాంగం సన్నా హాలు చేస్తోంది.

ప్రగతి నివేదన సభ

అదే రోజు సాయంత్రం నీలగిరి పట్టణంలో నిర్వహించే ప్రగతి నివేదన సభలో కేటీఆర్ పాల్గొని బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభి వృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివ రిస్తారు. శాసన సభ ఎన్నికలు దగ్గర పడుతుం డడంతో ప్రగతి నివేదన సభ ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ప్రణాళిక చేస్తున్నట్లు పార్టీ వర్గా లు చెబుతున్నాయి. ఎన్‌జీ కాలేజీ మైదానంలో సభ నిర్వహించే అవకాశం ఉంది.

ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకట్రావు, చిత్రంలో ఎస్పీ, అదనపు కలెక్టర్లు

- విధివిధానాలపై పూర్తి అవగాహన ఉండాలి
- కలెక్టర్ వెంకట్రావు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): ఎన్నికల నిర్వహణలో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సెక్టోరల్ అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తిం చాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.వెంక ట్రావు అన్నారు. సెక్టోరియల్ అధికారులకు శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మొదటి విడత శిక్షణ కార్యక్రమానికి ఎస్పీ రాజేంద్ర ప్రసాద్, అద నపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, ఏ.వెంకట్‌రెడ్డితో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. అన్ని పోలింగ్ కేంద్రాలను మూడు పర్యాయాలు సందర్శించి మౌలిక వసతుల పరిశీలించి నివేదికలు అందించాల న్నారు. కొత్త పోలింగ్ కేంద్రాలను రూట్ మ్యాప్‌లో పొందుపరిచి తదుపరి చర్యలు చేపట్టాలని సూచిం చారు. సీ విజిల్ యాప్‌కి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వా లని, అలాగే జిల్లా, రాష్ట్ర స్థాయి బోర్డర్ చెక్ పోస్టు ల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేసి ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. అనంతరం ఎస్పీ మాట్లా డుతూ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై పటిష్ట నిఘా ఉంచాలని, శాంతి భద్రతల విషయంలో పోలీస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తదుపరి మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ అం దించారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్ ఆర్డీఓలు వీరబ్రహ్మాచారి, సూర్య నారాయణ, జగదీశ్వర్‌రెడ్డి, డీఎస్పీ నాగభూషణం, రవి, డీఆర్డీఓ కిరణ్ కుమార్, సీపీఓ వెంకటేశ్వర్లు, ఏడీఓ రామారావు నాయక్, డీహెచ్ఓ శ్రీధర్, తహ సీల్దార్లు, వివిధ శాఖల అధికారులు, మాస్టర్ ట్రైనర్స్ వి.రమేష్, టి.పరమేష్ పాల్గొన్నారు.

ప్రగతి నివేదికలు సమర్పించాలి

జిల్లాలో 2014 నుంచి ఇప్పటి వరకు చేపట్టిన అభి వృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో ప్రగతి నివేదిక తయారుచేసి సమర్పించాలని కలె క్టర్ ఎస్.వెంకట్రావు కోరారు. శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు బంధు, రైతు బీమా, రైతు రుణమాఫీ లబ్ధిదారుల జాబితా, 24 గంటల ఉచిత విద్యుత్ పొందుతున్న రైతుల వివరాలు, సంక్షేమ శాఖల ద్వారా లబ్ధి పొందుతున్న వారి జాబితా అందించాలన్నారు. జిల్లా సమగ్ర ప్రగతి నివేదిక రూపొందించేందుకు అన్ని శాఖల అధికారులు సత్వరమే తమ శాఖల పూర్తి వివరాలను సమర్పించాలన్నారు. ఈ సమీక్ష లో జిల్లా అదనపు కలెక్టర్లు సీహెచ్.ప్రియాంక, ఏ.వెంకట్‌రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గాయపడిన యువకుడి మృతి

శాలిగౌరారం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. శాలిగౌరారం మండలం పెర్కకొండారం గ్రామానికి చెందిన మాచర్ల యాదగిరి–ఆగ్నేషా దంపతులకు ఇద్దరు కూతుళ్లతో పాటు కుమారుడు సందీప్(28) ఉన్నాడు. సందీప్ ఈనెల 12న రాత్రి వ్యక్తిగత పనిపై బైక్‌పై నకిరేకల్‌కు వెళ్తున్న క్రమంలో పెర్కకొండారం–కడపర్తి శివారులో రోడ్డుపై అడ్డంగా పెట్టిన ప్రొక్లెయిన్‌ను వెనుకనుంచి ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృత్యువాత పడటంతో ఆ తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించిన తీరు అక్కడకు వచ్చిన ప్రతీ ఒక్కరిని కంటతడి పెట్టించింది.

శ్రీలక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

మఠంపల్లి : సూర్యాపేట జిల్లాలో ప్రసిద్ధి గాంచిన మట్టపల్లిలో గల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని శనివారం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, మాంగల్యధారణ, తలంబ్రాలతో పూజలు నిర్వహించారు. కాగా శుక్రవారం రాత్రికే ఆలయానికి చేరుకున్న రెండు తెలుగు రాష్ట్రాల భక్తులు ఆలయంలో బసచేసి తెల్లవారుజామునే కృష్ణానదిలో పుణ్యస్నానాలాచరించి స్వామివారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చెన్నూరు మట్టపల్లిరావు, ఈఓ నవీన్‌కుమార్ అర్చకులు కృష్ణమాచార్యులు,పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి,ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఉద్యమకారుడికి ప్రభుత్వం మొండి చేయి

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలోని వైకుంఠాపురం గ్రామ పంచాయతీ పరిధిలో గల జానలదిన్న గ్రామానికి చెందిన తక్కెళ్ల నాగార్జున తెలంగాణ ఉద్యమకారుడు. ఆయన నాడు మలిదశ తెలంగాణ ఉద్యమంలో చురుకైన కార్యకర్తగా పనిచేశాడు. ఇటీవల అతడి ఇల్లు ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో దగ్ధం కావడంతో నిలవ్వనీడలేక పోయింది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్నాడు. కాని ఏ ఒక్క అధికారి, ప్రజాప్రతినిధి కనికరం చూపకుండా గృహలక్ష్మి పథకం అందించకుండా మొండి చేయి చూపారని ఆందోళన చెందాడు. దీంతో నాగార్జున నేరేడుచర్లలో బిక్షాటన చేస్తూ నిరసన వ్యక్తం చేశాడు.



బిక్షాటన చేస్తున్న నాగార్జున

ఒకే మాట.. ఒక్కటే విగ్రహం

- కేశవాపురంలో ఏకదంతుడి విగ్రహం ఏర్పాటు
- కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా పూజలు
- నాలుగు దశబ్దాలుగా కొనసాగుతున్న ఆనవాయితీ



వినాయక మండపం వద్ద భజన చేస్తున్న గ్రామస్తులు

మాడుగులపల్లి: వినాయక నవరాత్రి ఉత్సవాలు వస్తే వాడవాడలో సందడే. మండపాలను సర్వాంగ సుందరంగా అలంకరించి వీధికో విగ్రహం పెట్టి నిర్వాహకులు చేసే హడావిడి మామూలుగా ఉండదు. డీజే పాటలు, నృత్యాలు, ఇతర వినోద కార్యక్రమాలతో తారాస్థాయి హంగామా ఉంటుంది. ఖర్చుకు వెనుకాడకుండా దర్పం ప్రదర్శించేందుకు ఒకరికొకరు పోటీ పడుతుంటారు. ఇలాంటి పరిస్థితులున్న ప్రస్తుతం తరుణంలోనూ మాడుగులపల్లి మండలంలోని కేశవాపురం గ్రామస్తులు ఇందుకు పూర్తి భిన్నంగా చవితి వేడుకలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ప్రత్యేకత ఇదే..

కేశవాపురం (పెద్దపాడు) గతంలో ఉమ్మడి కన్నెకల్లు గ్రామ పంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామం. ఏడు సంవత్సరాల క్రితం ప్రభుత్వం 500లోపు జనాభా ఉన్న గ్రామాలను పంచాయతీలుగా గుర్తించడంతో ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటైంది. 1981 నుంచి గ్రామస్తులు ఇక్కడ చవితి వేడుకలను నిరాడంబరంగా నిర్వహిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం పెద్దలు నిర్ణయించిన విధంగానే ఇప్పటికీ ఒకే విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ ఆనవాయితీగా కొనసాగిస్తున్నారు. కులమతాలకు అతీతంగా అందరూ కలిసి ఈ విగ్రహం వద్దే పూజలు నిర్వహిస్తారు. మండపం వద్ద డీజేలు, నృత్యాలు కాకుండా భజనలు, కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తారు. 2002 వరకు ఇంటింటికీ చందాలు పోగేసి వేడుకలు నిర్వహించారు. ఆ తరువాత నుంచి లడ్డూ వేలంపాట ద్వారా వచ్చిన మొత్తాన్నే మరుసటి ఏడాది వేడుకల నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.

ఆనవాయితీ కొనసాగిస్తున్నాం



గ్రామస్తులంతా కలిసిమెలిసి ఉండాలన్న ఉద్దేశంతో 40 ఏళ్ల క్రితం పెద్దలు గ్రామంలో ఒకే వినాయక విగ్రహం పెట్టాలని నిర్ణయించారు. అప్పటి నుంచి ఈ ఆనవాయితీనే కొనసాగిస్తున్నాం. కులమతాలు, రాజకీయాలకుఅతీతంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నాం. గ్రామస్తుల ఐక్యత కారణంగానే నాలుగు దశాబ్దాలుగా విజయవంతంగా వేడుకలు జరుగుతున్నాయి. – గనిపెల్లి మోహన్, కేశవాపురం గ్రామస్తుడు

నిరాడంబరంగా వేడుకలు చేస్తాం



గ్రామంలో వినాయక చవితి వేడుకలను నిరాడంబరంగా నిర్వహిస్తాం. డీజేలు, మైకులు, ఇతరాత్ర వినోద కార్యక్రమాలకు తావులేకుండా భజనలు, కోలాటాలకు ప్రాధాన్యం ఇస్తాం. ఉత్సవ కమిటీ నిర్ణయం మేరకు అందరం నడుచుకుంటాం. ఒకరినొకరం గౌరవించుకుంటూ ఐక్యంగా ముందుకు సాగుతాం. భక్తులకు అన్నదానం చేసేందుకు మాత్రమే దాతల సహకారం కోరతాం. – నెర్మటి వెంకట్‌రెడ్డి, కేశవాపురం సర్పంచ్

45 ఏళ్లుగా గణనాథుడి సేవలో..

భూదాన్‌పోచంపల్లి : పట్టణ కేంద్రంలోని నేతాజీ యువజన సంఘం సభ్యులు 45 ఏళ్లుగా గణనాథుడి సేవలో తరిస్తున్నారు. భూదాన్‌పోచంపల్లి మండలంలోనే మొట్టమొదటి సారిగా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణ కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్టించారు. నాటి నుంచి నేటి వరకు నిర్విరామంగా ప్రతిఏటా గణనాథుడిని ప్రతిష్టించి భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నారు. మొదట్లో హైదరాబాద్‌లోని ధూళిపేటలో ఆర్డర్ ఇచ్చి వెయ్యి రూపాయలకు 5 అడుగుల వినాయక విగ్రహాన్ని తయారుచేయించి ఇక్కడికి తీసుకొచ్చి ప్రతిష్టించారు. అప్పట్లో ఒక్కటే వినాయక విగ్రహం ఉండటంతో ఊరంతా ఇక్కడికి వచ్చి గణనాథుడిని దర్శించుకునేది. మూడు, లేదా ఐదు రాత్రులను పురస్కరించుకొని భజనలు, కీర్తనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అంతేకాక దాతల సహకారంతో భక్తులకు మహాన్నదానం చేస్తున్నారు. కాగా పోచంపల్లి పర్యటనకు వచ్చిన అప్పటి సీఎం కోట్ల విజయభాస్కర్‌రెడ్డి, పతిపక్ష నేతగా ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, దివంగత మంత్రి ఎలిమినేటి మాధవరెడ్డి, మాజీ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేయడం విశేషం.



గణపతి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

మొదటి విగ్రహం మాదే..



పోచంపల్లిలోనే మొదట నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేశాం. గతంలో ముంబాయి, హైదరాబాద్ లాంటి మహానగరాల్లో ప్రతిష్టించేది. అయితే పోచంపల్లిలో కూడా గణేశ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నాడు సంఘం అధ్యక్షుడిగా ఉన్న గునిగంటి సుదర్శన్ నిర్ణయించారు. అప్పట్లో ఊరంతా ఇక్కడికి వచ్చి వినాయకుడిని పూజించేది. చాలా మంది ప్రముఖులు మా వినాయకుడిని దర్శించుకొని పూజలు చేశారు.

– సార బాలయ్యగౌడ్, నేతాజీ యువజన సంఘం గౌరవ సలహాదారుడు, భూదాన్‌పోచంపల్లి

మార్కండేయ దేవాలయంలో 45 ఏళ్లుగా..

- గణేశ్ నవరాత్రి వేడుకలు

రాజాపేట : రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ భక్తమార్కండేయ దేవాలయంలో 45 ఏళ్లుగా గణేశ్ నవరాత్రి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆలయంలో వినాయక విగ్రహ ఏర్పాటును అప్పటి పద్మశాలీ కులస్తులు 1979లో దాత రవ్వ నర్సింహులు ద్వారా ఏర్పాటు చేశారు. నాటి నుంచి నేటివరకు భక్తిశ్రద్ధలతో సాంప్రదాయ బద్ధంగా శ్రీ గణనాధుడిని ఏర్పాటు చేస్తూ వస్తున్నారు. ఆనాడు దాతల సహాయంతో విరాళాలు సేకరించి అందులో ఖర్చుపోను మిగిలిన డబ్బులు రొటేషన్ పద్ధతి ద్వారా కొనసాగించారు.

ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసుకుంటాం



పద్మశాలీ కులస్తులమంతా కలిసి వినాయకుడి విగ్రహం ఏర్పాటుకు ప్రత్యేక నిధి ఏర్పాటు చేసుకుంటాం. వినాయకుడి వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ, ఫలం ద్వారా వచ్చిన డబ్బులతో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుంటాం.

– ఆడెపు శ్రీశైలం, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు రాజాపేట



రాజాపేటలో వినాయకుడి విగ్రహం వద్ద పూజలు చేస్తున భక్తులు

విభిన్నమైన మండపం సెట్టింగులతో..

- చౌటుప్పల్‌లోని గాంధీ పార్కు ఆవరణలో 1975 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు
- మొదటి పదేళ్లు ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో..
- 1985 నుంచి శివాజీ యూత్ ఆధ్వర్యంలో వేడుకలు



చౌటుప్పల్‌లోని గాంధీపార్కులో శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపం సెట్టింగ్

చౌటుప్పల్: పట్టణ నడిబొడ్డున ఉన్న గాంధీపార్కులో గత 49 ఏళ్లుగా వినాయక చవితి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. 1975లో ఇక్కడ వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదట్లో ఆదర్శ యూత్ పేరిట వేడుకలు జరిగేవి. దివంగత మాజీ సర్పంచ్ గోశిక వెంకటేశం ఇక్కడ మండపాన్ని ఏర్పాటు చేసి చవితి వేడుకలకు అంకురార్పన చేశారు. పదేళ్ల పాటు అదే యూత్‌త్ ఆధ్వర్యంలో, అతడి సారధ్యంలోనే ఉత్సవాలు జరిగాయి. ఆ తర్వాత 1985 సంవత్సరం నుంచి శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ప్రతి ఏడాది విభిన్నమైన సెట్టింగ్‌లతో మండపం ఏర్పాటు చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఇక్కడ నెలకొల్పే వినాయక విగ్రహాలు అప్పట్లో ఈ ప్రాంతంలోనే అత్యంత ఎత్తైనవిగా గుర్తింపు పొందాయి. 1996లో 16 ఫీట్ల విగ్రహాన్ని హైదరాబాద్ నుంచి తీసుకు వచ్చే క్రమంలో విద్యుత్ ప్రమాదాలు జరిగాయి. విగ్రహాన్ని తీసుకువస్తున్న డీసీఎం పలు ప్రాంతాల్లోని రైల్వే బ్రిడ్జిల కింద నుంచి రాలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అప్పటి నుంచి నిర్వాహకులు విగ్రహం ఎత్తు తగ్గించి మండపాన్ని భారీ సెట్టింగ్‌లతో అలంకరించే అంశానికి ప్రాధాన్యత ఇస్తున్నారు.

ప్రత్యేక గుర్తింపు ఉంది



గాంధీ పార్కు ఆవరణలో వినాయక చవితి ఉత్సవాలను గత 39ఏళ్లుగా నిర్వహిస్తున్నాం. అంతకు ముందు పదేళ్ల పాటు ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. మొదట్లో విగ్రహం ఎత్తుకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వగా ప్రస్తుతం మండపం అలంకరణకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నాం. చౌటుప్పల్ పట్టణంలో వినాయక చవితి ఉత్సవాలు అనగానే శివాజీ యూత్ అనే విధంగా ప్రత్యేక గుర్తింపు లభించింది.

– గుజ్జుల సురేందర్‌రెడ్డి, శివాజీ యూత్ అధ్యక్షుడు, చౌటుప్పల్

అబ్దుల్ కలాం నేషనల్ అవార్డుకు ఎంపిక

మునగాల : మండలంలోని ఆకుపాముల గ్రామానికి చెందిన బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకుడు, సామాజిక కార్యకర్త పోలంపల్లి సుధాకర్‌గౌడ్ డా.ఏపీజే అబ్దుల్ కలామ్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు శనివారం స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఫౌండర్, చైర్మన్ డా.ఆకుల రమేష్ ఈ అవార్డును ప్రకటించినట్లు ఓ లేఖను సుధాకర్‌గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్‌గౌడ్ స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. తాను విద్యార్థి సంఘం నాయకుడిగా విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై పోరాటం చేశానని, చిన్న వయస్సులోనే గ్రామంలో వార్డు సభ్యుడిగా ఎన్నికై గ్రామంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేశానన్నారు. కేవలం తమ గ్రామానికే కాకుండా కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా పలు సేవా కార్యక్రమాలు, ఉచిత వైద్యశిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడమే కాక అనాథాశ్రమాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తాను చేసిన సేవలను గుర్తించిన హైదరాబాద్‌లోని స్ఫూర్తి సర్వీసెస్ ఇండియా ఎన్జీఓ సంస్థ తనకు నేషనల్ అవార్డును ప్రకటించినట్లు ఆయన తెలిపారు. ఈ అవార్డు రావడం గర్వంగా ఉందన్నారు. వచ్చే నెల 3వ తేదీన హైద్రాబాద్‌లోని తెలంగాణ సరస్వతి పరిషత్ హాల్‌లో తనకు ఈ అవార్డును అందచేయడం జరుగుతుందని సుధాకర్ గౌడ్ తెలిపారు.

ఉపాధి లేక యువకుడి బలవన్మరణం



రాజు(ఫైల్)

సంస్థాన్ నారాయణపురం : ఉపాధి కరువవడంతో ఆర్థిక ఇబ్బందులకు తాళలేక ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సంస్థాన్ నారాయణపురం మండలం జనగామలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ గ్రామానికి చెందిన వరికుప్పల రాజు(23) కంప్రెషర్ వాహనాన్ని అద్దెకు తీసుకొచ్చి నడిపిస్తున్నాడు. వాహనానికి పనులు సరిగా దొరకకపోవడంతో ఆర్థి కంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ నేపథ్యంలోనే మనస్తాపానికి గురైన రాజు గ్రామంలో కూలీలకు అద్దెకు తీసుకున్న ఇంట్లోనే శనివారం స్లాబ్ కొక్కానికి లుంగీతో ఉరేసుకున్నాడు. ఇంటి ముందు నుంచి వెళ్తున్న వారు గమనించడంతో అప్పటికే రాజు మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.మృతుడు తండ్రి కృష్ణయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేంద్ర తెలిపారు.

చిరుత పులి పిల్లలా.. అడవి పిల్లులా ?

- దామరచర్ల మండలం ఇర్కిగూడెంలో పాదముద్రల కలకలం



పాదముద్రలను పరిశీలిస్తున్న అటవీ, పోలీసుశాఖ అధికారులు

మిర్యాలగూడ: దామరచర్ల మండలం ఇర్కిగూడెంలోని కృష్ణా పరీవాహక ప్రాంతంలో చిరుత పులి పిల్లలవిగా భావిస్తున్న పాదముద్రలు కలకలం రేపాయి. స్థానికులు ఫారెస్ట్, పోలీసు శాఖల అధికారులకు సమాచారం ఇవ్వడంతో శనివారం ఇర్కిగూడెం అటవీ పరిసర ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. అద్దంకి– నార్కట్‌పల్లి రహదారి పక్కన కృష్ణానది సమీపంలో రెండు చిరుతపులి పిల్లలు తిరుగుతున్నాయని కొందరు అటవీశాఖ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, పోలీసు అధికారులు పరిసర ప్రాంతాలను గాలించారు. పాదముద్రలను పరిశీలించి ఒక అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. అవి చిరుత పిల్లలు కావని అడవి పిల్లికి చెందిన పాదముద్రలుగా ఫారెస్ట్ అధికారులు భావిస్తున్నారు. రాత్రి వేళ అటవీ సిబ్బందిని నిఘా ఉంచామని, అవి పులి పిల్లలా, అడవిపిల్లులా అనేది నిర్ధారణ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ ఆనంద్‌రెడ్డి, మిర్యాలగూడ సీఐ సత్యనారాయణ, వాడపల్లి ఎస్‌ఐ రవికుమార్, బీట్ ఆఫీసర్ ముఖేష్, మిర్యాలగూడ బీట్ ఆఫీసర్లు ప్రవీణ్‌కుమార్, ఆజం పాల్గొన్నారు.



చిరుత పులి పిల్లదిగా గ్రామస్తులు అనుమానిస్తున్న పాదముద్ర

అర్హులకు ‘గృహలక్ష్మి’ వర్తింపజేయాలని ఆందోళన

అర్వపల్లి : అనర్హులకు గృహలక్ష్మి పథకాన్ని మంజూరు చేశారని, అర్హులైన వారికి పథకాన్ని వర్తింపజేయాలని అఖిలపక్షాల ఆధ్వర్యంలో శనివారం జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం గ్రామంలో కాంగ్రెస్, సీపీఎం, బీజేపీ, న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ధర్నా విషయం తెలుసుకున్న నాగారం సీఐ శివశంకర్, అర్వపల్లి, తిరుమలగిరి, నాగారం ఎస్‌ఐలు అంజిరెడ్డి, ప్రసాద్, ముత్తయ్య తమ సిబ్బందితో గ్రామానికి వెళ్లి ఆందోళన విరమించాలని అఖిలపక్ష నాయకులను కోరారు. అర్హులైన వారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేసేవరకు ఆందోళన విరమించేదిలేదని నాయకులు చెప్పడంతో పోలీసులకు, నాయకుల మధ్య తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వరకు వారిని స్టేషన్‌లో ఉంచి అనంతరం విడుదల చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నెపర్తి జ్ఞానసుందర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కడియం రామచంద్రయ్య, సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, ఆలిండియా యూత్ కాంగ్రెస్ నాయకురాలు మమతానాగిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, శిగ నసీర్‌గౌడ్, వజ్జె శ్రీనివాస్, కూర శంకర్, దాసరి సోమయ్య, బింగి కృష్ణమూర్తి , కొమిరెల్లి, నర్సింగ కృష్ణమూర్తి, రవీందర్, మహిళలు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

దుకాణదారుడిపై చేయి చేసుకున్న వ్యక్తిపై కేసు

హుజూర్‌నగర్ : బేకరీ దుకాణదారుడిపై చేయి చేసుకున్న వ్యక్తిపై హుజూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. హుజూర్‌నగర్ పట్టణంలోని మిర్యాగూడ రోడ్డులో గల ఫేమస్ బేకరీలోకి శనివారం ప్రదీప్‌రెడ్డి ప్రవేశించాడు. దౌర్జన్యంగా చాక్లెట్ తీసుకున్నాడు. దుకాణదారుడు డబ్బులు అడగడంతో ఏందిరా నన్నే డబ్బులు అడుగుతావా అంటూ దుర్భాషలాడి అతనిపై చేయి చేసుకుని వెళ్లిపోయాడు. ఇదంతా అక్కడున్న సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. అనంతరం దుకాణం యజమాని జాసిద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : విద్యార్థిని అదృశ్యమైంది. అర్వపల్లి మండలం లోయపల్లి గ్రామానికి చెందిన రాజబోయిన పూజిత సూర్యాపేటలోని శ్రీనిధి కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఈనెల 20న పూజిత కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయలుదేరింది. బస్సు మిస్ కావడంతో అదే గ్రామానికి చెందిన వ్యక్తి బైక్‌పై నెమ్మికల్ వరకు వచ్చింది. అనంతరం అక్కడినుంచి పూజిత కనిపించకుండాపోయింది. సాయంత్రం పూజిత ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో ఆరా తీసినా ఆచూకీ లభించలేదు. దీంతో పూజిత తల్లి జయమ్మ శనివారం ఆత్మకూర్(ఎస్) పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ రివర్స్ తీస్తుండగా ప్రమాదం

- వ్యక్తి పైనుంచి టైరు వెళ్లడంతో మృతి
- చౌటుప్పల్ మండలం దండుమల్కాపురంలో విషాదం

చౌటుప్పల్ : ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యానికి ఓ వ్యక్తి బలయ్యాడు. చౌటుప్పల్ మండల పరిధిలోని దండుమల్కాపురం గ్రామంలో శనివారం చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. దండుమల్కాపురం గ్రామానికి చెందిన అత్తాపురం సంజీవరెడ్డి (65)కి ట్రాక్టర్ ఉంది. స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో మట్టితోలేందుకు కిరాయికి వెళ్లాడు. పరిశ్రమలో ఎత్తుగా ఉన్న ప్రదేశంలో మట్టి అన్‌లోడ్ చేయాల్సి వచ్చింది. తనకు ట్రాక్టర్‌ను రివర్స్ తీయడం రాకపోవడంతో మరో ట్రాక్టర్ డ్రైవర్ సాయాన్ని కోరాడు. ఆ క్రమంలో వెనుక వైపు అత్తాపురం సంజీవరెడ్డి నిల్చున్న విషయాన్ని గమనించకుండా, నిర్లక్ష్యంగా సదరు డ్రైవర్ ట్రాక్టర్‌ను వెనక్కి తీశాడు. దాంతో ట్రాక్టర్ వెనుక భాగంలోని ట్రాలీ టైరు ఒక్కసారిగా సంజీవరెడ్డి మీది నుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన అతడిని హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని సీఐ ఎస్.దేవేందర్ తెలిపారు.



సంజీవరెడ్డి(ఫైల్)

టిప్పర్ ఢీకొని రైతు దుర్మరణం

- ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణం
- మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని బంధువుల ఆందోళన



దేవరకొండలో రహదారిపై ఆందోళన చేస్తున్న పంతు బంధువులు

దేవరకొండ : టిప్పర్ ఢీకొని ఓ రైతు దుర్మరణం చెందాడు. ఈ ఘటన దేవరకొండ పట్టణంలో శనివారం చోటుచేసుకుంది. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొండమల్లేపల్లి మండలం వద్యతండా గ్రామపంచాయతీ పరిధి కారోబార్‌తండాకు చెందిన నేనావత్ పంతు(52) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వరిచేనుకు క్రిమిసంహారక మందు కొనేందుకు శని వారం దేవరకొండ పట్టణానికి బైక్‌పై వచ్చాడు. పట్టణంలోని బస్టాండు సమీపంలోకి రాగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ వాహనం బలంగా పంతు బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో రోడ్డుపై పడిన పంతుమీద నుంచి టిప్పర్ వాహనం వెళ్లడంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు.

న్యాయం చేయాలని బంధువుల ఆందోళన

పంతు మృతి విషయం తెలుసుకున్న అతడి బంధువులు, తండావాసులు పెద్ద ఎత్తున దేవరకొండకు చేరుకొని రోడ్డుపై ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని, ప్రమాదానికి కారణమైన వారి పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దాదాపు రెండు గంటలకు పైగా మృతుడి బంధువులు రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని న్యాయం చేస్తామని హామీనివ్వడంతో మృతదేహాన్ని దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సరైన స్పందన రాకపోవడంతో మృతుడి బంధువులు రాత్రి మరోసారి దేవరకొండ ప్రభుత్వాస్పత్రి ఎదుట ప్రధాన రహదారిపై ధర్నా చేపట్టారు. మృతుడి కుటుంబానికి అన్ని విధాలుగా న్యాయం చేస్తామని పోలీసులు హామీనివ్వడంతో శాంతించారు. ఈ ఘటనపై రాత్రి వరకు ఫిర్యాదు అందలేదని, ప్రమాదానికి టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని సీఐ నాగభూషణరావు తెలిపారు.



ఘటనాస్థలంలో పంతు మృతదేహం